09042025-DIS-04_Layout 1 4/9/2025 3:16 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

గవర్నర్ 'ముద్ర'కు సుప్రీం కాలపరిమితి

కాంగ్రెస్ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వాలు గవర్నర్లను అడ్డుపెట్టుకొని కాంగ్రెసేతర రాష్ట్ర ప్రభుత్వాలను వేధింపులకు గురిచేసేవి. అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను తొక్కిపెట్టడం మొదలు రాష్ట్ర ప్రభుత్వాలను రాజ్యాంగ విరుద్ధంగా బర్తరఫ్ చేయడమే గవర్నర్ల వ్యవస్థ లక్షణంగా మారిపోయింది. ఈ విషయంలో కాంగ్రెస్, బీజేపీల మధ్య పెద్దగా తేడాలు లేవని మనకు ఇటీవలి కాలంలో తేలిపోయింది. విపక్ష రాష్ట్ర ప్రభుత్వాలను చికాకు పరిచేందుకు గవర్నర్ గిరీని వినియోగించడంలో బీజేపీ రెండాకులు ఎక్కువే చదివినట్టు గత పదేండ్ల పైచిలుకు అనుభవం రుజువు చేసింది. కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ సర్కారు నిర్ణయాలను తొక్కిపెట్టిన ఇదివరకటి గవర్నర్ సతాయింపులు మనం ఇంకా మరిచిపోలేదు.

ఇటీవలి కాలంలో తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి డీఎంకే ప్రభుత్వంతో గిల్లికజ్జాలకు దిగడం దేశవ్యాప్తంగా చర్చాంశమైంది. మరీ ముఖ్యంగా శాసన వ్యవస్థ నిర్ణయాలను ఆయన తొక్కిపెట్టడం తీవ్ర వివాదాలకు దారితీసింది. కోర్టులు మొట్టికాయలు వేసినా పరిస్థితిలో ఎలాంటి మార్పు రాలేదు. రాష్ట్ర శాసనవ్యవస్థ ఆమోదించిన, రాష్ట్ర మంత్రిమండలి సానుకూలంగా సిఫారసు చేసిన పది బిల్లులను ఆయన తొక్కిపెట్టడం ఈ ధోరణికి పరాకాష్ఠ. అసెంబ్లీ రెండోసారి ఆమోదించి పంపినప్పటికీ వాటిని రాష్ట్రపతి పరిశీలనకు నివేదించడం మరీ విడ్డూరం. అలా చేయడమంటే ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలను కేంద్రం చేతుల్లో పెట్టడం తప్ప మరోటి కాదు. గవర్నర్ అధికారాలకు గల పరిమితిని ఆయనకు గతంలో ఎన్నో సందర్భాల్లో సుప్రీంకోర్టు గుర్తుచేసింది. అయినా అవేవీ ఆయన పట్టించుకున్నట్టు లేదు. తాజాగా బిల్లుల నిలిపివేతపై సుప్రీంకోర్టు మంగళవారం వెలువరించిన తీర్పు మైలురాయి లాంటిదని చెప్పవచ్చు. గవర్నర్ రవి చర్యను రాజ్యాంగ విరుద్ధమని సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. సదరు నివేదనపై రాష్ట్రపతి తీసుకునే ఎలాంటి చర్యలైనా నిలబడజాలవని స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని 142 అధికరణం కింద తనకు దఖలు పడిన విశిష్టమైన అధికారాలను ఉపయోగించుకొని ఆ బిల్లులు గవర్నర్ ఆమోదం పొందినట్టుగా ప్రకటించడం గమనార్హం.

ఈ కీలక తీర్పులో సుప్రీంకోర్టు సమయ ప్రణాళికను సూచించింది. రాష్ట్ర మంత్రిమండలి సలహాకు విరుద్ధంగా రాష్ట్రపతికి పంపాలనుకుంటే మూడు నెలల్లోగా ఆ పనిచేయాలి. రెండోసారీ, అదీ ఎలాంటి మార్పుచేర్పులు లేకుండా బిల్లును పంపితే నెల రోజుల్లోగా గవర్నర్ రాజముద్ర వేయాలని నొక్కిచెప్పింది. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలకు వారధిగా, రాష్ట్రంలో రాజ్యాంగబద్ధ పాలనకు సారథిగా ఉండాల్సిన గవర్నర్లు తరచూ వివాదాలకు కేంద్రబిందువుగా మారడం ప్రజాస్వామ్యానికీ, సమాఖ్యవాదానికీ శోభించదు. కేంద్రంలో, రాష్ట్రంలో ఒకే పార్టీ ప్రభుత్వం ఉంటే గవర్నర్ల తీరు ఒకరకంగా, భిన్నపార్టీల ప్రభుత్వాలుంటే మరోరకంగా ఉండటం ఆమోదయోగ్యం కాదు. సుప్రీంకోర్టు తాజాగా ఇచ్చిన సంచలన తీర్పు నేపథ్యంలో గవర్నర్ల తీరు మారుతుందని ఆశించడంలో తప్పు లేదు.

వక్ఫ్‌బిల్లుకు వాట్సాప్ వర్సిటీ వత్తాసు

'ముస్లిం సమాజ హితం కోసం' అనే అందమైన ముసుగు తొడిగి 'వక్ఫ్ చట్టం- 1995'లోని ఇటీవల పార్లమెంట్ ఆమోదించిన సవరణలన్నీ ఏకపక్షంగా ఉన్నాయి. వక్ఫ్ ఆస్తుల నిర్వహణలో ముస్లింల పాత్ర తగ్గించి, ముస్లిమేతరులు ముఖ్యంగా, ప్రభుత్వ తాబేదార్ల జోక్యం పెంచి, తద్వారా లక్షల ఎకరాల వక్ఫ్ భూములు బడా వ్యాపారవేత్తలకు కట్టబెట్టడానికి మార్గం సుగమం చేసినట్టయ్యింది. ఈ వక్ఫ్ సవరణలను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టకముందే బీజేపీ తనదైన శైలిలో వాట్సాప్ యూనివర్సిటీ ద్వారా వక్ఫ్ ఆస్తులపై, వక్ఫ్‌బోర్డుపై తీవ్రమైన దుష్ప్రచారం చేసింది. 'వక్ఫ్ బోర్డు' అంటే జన బాహుళ్యంలో ఒక భూ మాఫియాగా, హిందువుల ఆస్తులను, దేశ ఆస్తులను కబళించే ఒక రాక్షస సంస్థగా చిత్రీకరించడంలో బీజేపీ కొంతమేర సఫలమైంది.

మహ్మద్ జమీలొద్దీన్ అహ్మద్
86862 11556

కేంద్రంలోని ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వానికి 1995 చట్టంలోని చాలా సెక్షన్లు నచ్చక వాటిని తొలగిస్తూ, సవరణలు చేస్తూ వక్ఫ్ సవరణ బిల్లు 2025 ప్రవేశపెట్టి తమ మద్దతుదారుల సహకారంతో, ముస్లిం ప్రజల, సంఘాల, విపక్షాల అభ్యంతరాలను తోసిపుచ్చి, అర్ధరాత్రి 3 గంటలకు ఆమోదించుకొని, నిన్న అమల్లోకి తీసుకువచ్చింది. అయితే, వక్ఫ్ 1995 చట్టంలోని సవరణలు, తొలగింపులు, మార్పుచేర్పులపై ముస్లిం సమాజానికి ఉన్న అభ్యంతరాలను ఒకసారి పరిశీలిద్దాం.

- సెక్షన్ 3 ఆఫ్ వక్ఫ్ ఆక్ట్ 1995ను సవరించి sec. 3(i) (aa), sec. 3(i) (ca) చేర్చి ప్రస్తుతం ఉన్న వక్ఫ్ బోర్డులను విభజించి 'ఆగాఖాని వక్ఫ్ బోర్డు', 'బొహరా'ల కోసం ప్రత్యేక వక్ఫ్ బోర్డులను ఏర్పాటు చేయడమన్నది ముస్లిం సమాజంలో చీలిక తేవడానికి ఉద్దేశించినది మాత్రమే.
- సెక్షన్ 3ను సవరించి sec. 3 (ix) (c)లో వితంతువులు, విడాకులు పొందినవారు, అనాథల పోషణ అని చేర్చడం 'మనషాఏ వక్ఫ్' నుంచి డీవియెట్ కావడమే అవుతుంది.
- సెక్షన్ (3)ను సవరించి ఇస్లాంను ఐదేండ్ల కింది నుంచి ఆచరిస్తున్న వ్యక్తి మాత్రమే తన ఆస్తిని వక్ఫ్ చేయగలరని చేర్చడం దేశ సెక్యులర్ స్ఫూర్తికి విరుద్ధమైనది. అంతేకాకుండా కొత్తగా ఎవరు కూడా తమ ఆస్తిని వక్ఫ్ చేయకుండా నివారించడానికి మాత్రమే ఉద్దేశించింది. చాలా సందర్భాల్లో గ్రామాల్లో ముస్లిమేతరులు కూడా వారు నమ్మిన దర్గాకు తమ ఆస్తిని దానం ఇచ్చారు. అంతేకాకుండా గ్రామాల్లోని భూస్వాములు అక్కడి పేద ముస్లింల అభ్యర్థన మేరకు ఖబ్రస్థాన్లకు, మజీద్‌లకు భూములు దానం ఇచ్చిన సందర్భాలెన్నో. ఒక వ్యక్తి తన ఆస్తిని ఎవరికి దానం చేయవచ్చో, చేయరాదో కూడా ప్రభుత్వం నిర్దేశించడం ఆ వ్యక్తి ప్రాథమిక హక్కులకు భంగం కలిగించడమే.
- సెక్షన్ (4) 1995వ చట్టం ప్రకారం ఆస్తి నిర్ధారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం సర్వే కమిషనర్‌ను నియమించాలన్న నిబంధన తొలగించి జిల్లా కలెక్టర్‌కు అధికారాలు కట్టబెట్టారు. దీంతో వక్ఫ్ నిర్ధారణ ఆలస్యం చేయడంతో పాటు, వక్ఫ్ బోర్డుకు, ప్రభుత్వానికి వివాదం వచ్చినప్పుడు కలెక్టర్ ద్వారా ప్రభుత్వం అనుకూల నిర్ణయాలు తీసుకునే అస్కారం ఉంటుంది. అంతేకాదు, హిందూ ఎండోమెంట్ చట్టం సెక్షన్ 43 ప్రకారం ఎండోమెంట్ కమీషనర్‌కు హిందూ ఎండోమెంట్ రిజిష్టర్ చేసే అధికారం ఉటుంది. జిల్లా కలెక్టర్‌కు హిందూ ఎండోమెంట్ రిజిష్టర్ చేసే అధికారం ఉండదు. అదే ఒక వక్ఫ్ ఆస్తి రిజిస్ట్రేషన్ కోసం మాత్రమే వక్ఫ్ కమీషనర్‌ను తొలగించి జిల్లా కలెక్టర్‌కు అధికారం ఇవ్వడం ముస్లింల పట్ల వివక్షను ప్రదర్శించడమే.
- 1995వ చట్టం సెక్షన్ 6, 7 ప్రకారం వక్ఫ్ గెజిట్ ప్రచురణ అయిన తర్వాత ఆ ఆస్తిపై ఎవరికైనా అభ్యంతరం ఉంటే వారు ఏడాది లోపు వక్ఫ్ ట్రిబ్యునల్‌లో ఫిర్యాదు చేసే అవకాశం ఉన్నది. దాన్ని సవరించి ప్రస్తుత సవరణ బిల్లు ఫిర్యాదు కాలాన్ని 2 సంవత్సరాలకు పెంచడం వక్ఫ్ ఆస్తులపై వివాదాలను సృష్టించే అవకాశం ఇవ్వడమే.
- 1995వ చట్టం సెక్షన్ 14 ప్రకారం... రాష్ట్ర వక్ఫ్ బోర్డుకు ముస్లిం ఎమ్మెల్యే, ముస్లిం ఎంపీ, ముస్లిం ఎమ్మెల్సీ, ముతవల్లిలు, ముస్లిం అడ్వకేట్లతో ఎన్నిక నిర్వహించి వక్ఫ్ బోర్డు ఏర్పాటవుతుంది. అంతేకాదు, ప్రభుత్వం ఒక సున్నీ, ఒక షియా, ఒక ముస్లిం మహిళను రాష్ట్ర వక్ఫ్ బోర్డులో నామినేట్ చేస్తుంది. ప్రస్తుత సవరణల కారణంగా ఇద్దరు ముస్లిమేతరులను ప్రభుత్వం నామినేట్ చేసే అధికారం కట్టబెట్టడమన్నది ముస్లింల మతపరమైన అంశాల నిర్వహణలో ఇతరులను చొప్పించి, వారి స్వయం ప్రతిపత్తిని దెబ్బతీయడమే.

- హిందూ దేవాలయాల్లో స్వీపర్ పోస్టులో అన్య మతస్థులు ఉండకూడదని వాదించే పార్టీ, రాష్ట్రస్థాయిలో 11 మందితో ఏర్పాటయ్యే వక్ఫ్‌బోర్డులో ఏడుగురు, కేంద్రస్థాయిలో 22 మందితో ఏర్పాటయ్యే వక్ఫ్ కౌన్సిల్‌లో 11 మంది ముస్లిమేతరులను ప్రభుత్వం నామినేట్ చేసే అవకాశాన్ని కల్పించడాన్ని సమర్థించుకుంటుండటం శోచనీయం.
- 1995 చట్టం సెక్షన్ 20 (A) ప్రకారం వక్ఫ్ బోర్డు సభ్యులు వక్ఫ్‌బోర్డు చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి తొలగించే అధికారం ఉన్నది. కానీ, ప్రస్తుత సవరణలో ఆ సెక్షన్ 20(A)ను తొలగించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. అంతేకాదు, ఒక్కసారి చైర్మన్ అయిన వ్యక్తి ఎన్ని అవకతవకలకు పాల్పడినా అతడిని తొలగించే అధికారం సభ్యులకు లేకుండా చేశారు.
- వక్ఫ్ చట్టం 1995 సెక్షన్ 23 ప్రకారం డిప్యూటీ సెక్రెటరీ హోదాకు తగ్గకుండా ఉన్న ముస్లిం వ్యక్తి మాత్రమే వక్ఫ్ బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా ఉండాలని నిర్దేశిస్తుంది. ప్రస్తుత సవరణల వల్ల ముస్లిమేతరులు కూడా సీఈవో అయ్యే అవకాశం కల్పించారు. హిందూ ఎండోమెంట్ యాక్ట్ సెక్షన్ 152 ప్రకారం హిందువులు మాత్రమే ఎండోమెంట్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగానికి అర్హులు. అంతేకాదు, వారు మతం మారితే వారికి ఉన్న ఎండోమెంట్ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ తదితర పదవులు కోల్పోతారని కూడా స్పష్టంగా ఉన్నది. ముస్లిం వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులకు ఉన్నత పదవులు కట్టబెట్టడం అంటే కుట్రపూరితమే.
- వక్ఫ్ చట్టం-1995 సెక్షన్ 40 ప్రకారం... ఏదేని ఆస్తి వక్ఫ్‌దా, కాదా? అన్న వివాదం వచ్చినప్పుడు, ఆ విషయమై విచారణ జరిపి నిర్ణయం తీసుకునే అధికారం వక్ఫ్ బోర్డుకు ఉన్నది. వక్ఫ్‌బోర్డు నిర్ణయంపై ఎవరికైనా అభ్యంతరం ఉంటే వారు వక్ఫ్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించవచ్చు. వక్ఫ్ ట్రిబ్యునల్ తీర్పుపై కూడా అభ్యంతరం ఉంటే, హైకోర్టునూ ఆశ్రయించవచ్చు. కానీ, ఏ ఆస్తి అయినా వక్ఫ్ బోర్డు తనదని పేర్కొంటే అది వక్ఫ్‌బోర్డుదే అవుతుందని, వక్ఫ్‌బోర్డు నిర్ణయాన్ని సవాలు చేసే అధికారం లేదని సెక్షన్ 40పై తీవ్ర దుష్ప్రచారం చేసి దాన్ని ప్రస్తుత సవరణలతో తొలగించారు. Wakf By User అంటే, ఏదైనా పురాతన మజీద్, దర్గా ఉంటే దానిని పరిశీలించి వాడకం వల్ల అది వక్ఫ్‌గా ప్రకటించే అధికారాన్ని తొలగించారు. అంతే కాదు, ప్రతి మజీద్‌కు దర్గాకు, ఖబ్రస్థాన్, వక్ఫ్ ఆస్తికి దస్తావేజులు కోరడం వల్ల వందల ఏండ్ల నుంచి నమాజ్ తదితర ముస్లిం మత పరమైన కార్యక్రమాలు నిర్వహిస్తూ వక్ఫ్ సంస్థల ఆధీనంలో ఉన్న ఆస్తులపై వివాదాలకు అవకాశం కల్పించారు.
- 1995వ చట్టం సెక్షన్ 52 ప్రకారం ఎవరైనా 'వక్ఫ్ ఆస్తిని ఆక్రమిస్తే వారికి కఠిన కారాగార శిక్ష విధించవచ్చు' అన్న పదాన్ని నూతన సవరణలో తొలగించడం వల్ల వక్ఫ్ ఆస్తుల ఆక్రమణదారులకు ఎర్ర తివాచీ పరచడమే అవుతుంది.
- 1995వ చట్టం సెక్షన్ 83 ప్రకారం... ముగ్గురు సభ్యులతో ఏర్పాటయ్యే వక్ఫ్ ట్రిబ్యునల్‌లో ఇస్లామిక్ చట్టం తెలిసిన ఒక వ్యక్తి ఉండటాన్ని తొలగించి ఇద్దరు వ్యక్తులతోనే వక్ఫ్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని సర్వీసులో ఉన్న జిల్లా జడ్జి స్థానంలో రిటైర్డ్ జిల్లా జడ్జిని నియమించాలని సవరణ చేయడం వక్ఫ్ ట్రిబ్యునల్‌ను నిర్వీర్యం చేయడమే.
- సెక్షన్ 143 హిందూ ఎండోమెంట్ చట్టం, సెక్షన్ 52 ఆఫ్ బాంబే పబ్లిక్ ట్రస్ట్ యాక్ట్ సెక్షన్ 107, 108, 108 ఆఫ్ వక్ఫ్ చట్టం 1995 ప్రకారం ఏదేని హిందూ ఎండోమెంట్‌కు గానీ, వక్ఫ్‌కు గాని చెందిన ఆస్తి ఆక్రమణకు గురైతే ఆ ఆక్రమణను తొలగించడానికి లిమిటేషన్ చట్టం 1963 వర్తించదని పై (3) చట్టాలు చెప్తున్నాయి. కానీ, ప్రస్తుత సవరణ ద్వారా ఒక్క వక్ఫ్ చట్టంలోని సెక్షన్ 107, 108, 108 తొలగించడం వల్ల వక్ఫ్ ఆస్తుల ఆక్రమణదారులు లిమిటేషన్ యాక్ట్ 1963 ప్రకారం తమ కబ్జాను శాశ్వతపరుచుకొని, తద్వారా వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతం కావడానికి పూర్తి అవకాశం కల్పించింది.
- సెక్షన్ 108బీని సవరించి వక్ఫ్ నిబంధనలను తయారుచేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాల నుంచి కేంద్రం గుంజుకోవడం కూడా దేశ ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధం.

(నేటి నుంచి వక్ఫ్ బిల్లు అమలు..)

శ్రీశైల్ రెడ్డి పంజుగుల
90309 97371

కాంగ్రెస్ వాళ్లే ఫేక్ కింగ్‌లు!

ఘనత వహించిన మన ముఖ్యమంత్రి గురించి మీకందరికీ అంచనాలు ఉన్నాయి. కానీ, మనందరినీ అప్రతిభులను చేస్తూ; కొందరు మేధో నక్కల దింపుడుగల్లం ఆశలు వమ్ము చేస్తూ రోజురోజుకూ తన గొయ్యి వెడల్పు చేసుకుంటున్నరు రేవంత్!

తాజాగా హెచ్‌సీయూ విద్యార్థులను బొక్కలో వేయాలనుకొని తనే బొక్కబోర్లా పడ్డరు. అహ్మదాబాద్ ఏఐసీసీ సమావేశానికి ముందు ఇబ్బంది వద్దనుకున్న అధిష్ఠానం 'మీ దౌష్ట్యాన్ని కాస్త వాయిదా వేసుకోండి' అన్నట్టుంది!

మొహం చెల్లని రేవంత్ విద్యార్థులపై కేసులు వద్దని ఆర్థికమంత్రి ద్వారా పోలీసులకు ఆదేశాలు ఇప్పించిన్రు. విద్యార్థులు నిర్దోషులైతే, వారి పక్షాన కొట్లాడిన ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు దోషులు యెట్ల అవుతరు? వారిపై కేసులు యెట్ల కొనసాగిస్తరు? 'ఫేక్ వీడియోలు' పెట్టినవారిపై చర్యలకు అనుమతించాలంటూ కోర్టుకు యెట్లపోతరు? సుప్రీంకోర్టు ఆపేసిన మీ దుశ్చర్యలకు హైకోర్టు నుంచి రక్షణ పొందుతరా? తెలివి ఉన్న పనులేనా? నగుబాటుకు గురవ్వడంలో మీకు కనీస అలసటైనా రాదేమీ!

తమ ఆవాసం చెదిరిపోయి, భీతిల్లిన వన్యప్రాణుల హాహాకారాలు ఎంతోమంది హృదయాలను కదిలించినయి. కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరులు, తటస్థంగా ఉండేవారు సైతం తమ ఆగ్రహాన్ని వెళ్లగక్కిన్రు. అయినప్పటికీ మేలుకోని రేవంత్‌రెడ్డి సోషల్ మీడియాను దుమ్మెత్తి పోస్తున్నరు. మార్ఫ్ చేసిన ఫొటోలు, ఫేక్ వీడియోలు అంటూ ఆక్రోశపడుతున్నరు. కేసులు పెట్టండి, బొక్కలో తోయండి అంటూ హుకుం జారీ చేస్తున్నరు. సోషల్ మీడియాను హోరెత్తించి, జనాగ్రహాన్ని ప్రస్ఫుటింపజేసిన ఫొటోలు, వీడియోలు ఏఐ సహాయంతోనే చేసి ఉండవచ్చునుకానీ, వాస్తవదూరంగా లేవు కదా?

ప్రభావశీల వ్యక్తీకరణలకు విశేషణాలు, ఉపమానాలు తోడ్పడినట్టే టెక్నాలజీ కూడా ఉపయోగపడుతుంది. గూడు చెల్లాచెదురై జనావాసాలలోకి వచ్చి కుక్కలదాడిలో మరణించిన మూగజీవుల బాధ ప్రపంచానికి తెలియడం కోసం, అందుకు కారణభూతులను బోనులో నిలబెట్టడం కోసం ఎన్ని మార్ఫింగ్‌లు చేసినా న్యాయమే. సమస్య లోతుల్లోకి పోకుండా, తప్పులకు చెంపలు వేసుకోకుండా ఇంకా అదే మేకపోతు గాంభీర్యం, అదే ఆటవిక న్యాయం. అయినా... హైడ్రా పేరుతో పేదలు, మధ్య తరగతి వారిని తమ ఇండ్లలోంచి వీధుల్లో పడవేసిన మనిషికి (?); వారి రోదనకు చలించని రాతి గుండెకు పశుపక్ష్యాదుల వేదన ఒక లెక్కనా? నిజానికి సిసలైన ఫేక్ కింగ్‌లు కాంగ్రెస్ వారే కదా? తెలంగాణ ఉద్యమంపై తుపాకీ ఎక్కుపెట్టినోడు ఇపుడు తెలంగాణ రక్షకుడు అనడాన్ని మించిన ఫేక్ ఏముంటుంది? మార్ఫింగ్ జరిగింది దుర్మార్గ కాంగ్రెస్‌ను ప్రజా ప్రభుత్వంగా నమ్మించడంలో కాదా? ఆరు గ్యారెంటీలు, ప్రజాస్వామ్య వీచికలు, అనుదినం సీఎం దర్శనం లాంటి నకిలీ దృశ్యాల ఆవిష్కరణకు పాల్పడినవారికి రేవంత్ లెక్క ప్రకారం ఎన్ని శిక్షలు వేయాలి? కాంగ్రెస్ పార్టీకి బాండెడ్ లేబర్ లాంటి అబద్ధాల మేధో నక్కలను ఏ చెట్లకు కట్టేయాలి?

1969 తెలంగాణ ఉద్యమ ఫలితంగా వచ్చింది హెచ్‌సీయూ. నాడు ఇందిరా గాంధీ ఇచ్చిన 2300 ఎకరాల భూమిలో, నేటి మంత్రి శ్రీధర్ బాబు లెక్క ప్రకారమే 1500 ఎకరాలు మిగిలింది ఇపుడు అదీ నోటిఫై చేయలేదు. కాంగ్రెస్ పార్టీలోనే పుట్టినట్టు పోజు కొట్టే రేవంత్ రెడ్డి 'మా పార్టీ ఇచ్చిన భూమి, మా భూమి' అంటూ మాట్లాడుతున్నరు. ఘనత వహించిన పార్టీ ఇచ్చిన భూమికి లెక్కాపత్రం కూడా లేదు యూనివర్సిటీ దగ్గర. ప్రభుత్వం అంటే ప్రజలే అన్న సోయి లేకుండా వ్యవహరిస్తున్నరు. 'మా ఇంట్లకెల్లి ఇచ్చిన భూమిపై మీ పెత్తనం ఏందన్న' రీతిలో రాధాకృష్ణ-రేవంత్ కలసికట్టుగా న్యాయవ్యవస్థను నిలదీస్తున్నరు. కోర్టులను మేనేజ్ చేయడం బాగా వచ్చని చంద్రబాబు నాయుడుకు పేరున్నది. ఆయనను మించిపోయిన ఆర్కే-రేవంత్ ద్వయం మాత్రం న్యాయవ్యవస్థను బ్లాక్‌మెయిల్ చేయడం, భయపెట్టడం, అప్రతిష్ఠ పాలు చేయడం లాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నరు.

హెచ్‌సీయూలో ఏమీ జరగకపోతే, పులుగడిగిన ముత్యం లాంటిదే ఈ ప్రభుత్వం అయితే... సుప్రీంకోర్టు ఎందుకు అంత తీవ్రంగా స్పందించింది? ఎందుకు సొంత విద్యార్థి సంఘం ఎన్ఎస్‌యూఐ మీనాక్షీ నటరాజన్‌కు ఫిర్యాదు చేసింది? రాహుల్‌గాంధీ దృష్టికి తీసుకెళ్లి, హెచ్‌సీయూ భూములను కాపాడమని ఎందుకు అర్జీలు ఇచ్చింది?

ముఖ్యమంత్రి పదవి ముళ్ల కిరీటమై తనకే పూట గడవడం లేదు, ఇంకా అధిష్ఠానానికి కప్పమెట్లా కట్టేది? దాంతో పైనుంచి ఒత్తిడి. ఇపుడు అర్జెంటుగా ఏదో ఒకటి అమ్మాలి. అప్పు చేసి పప్పు కూడు కాదు, అప్పు చేసి చిప్ప కూడు అయింది పరిస్థితి. ఈ సందర్భంలో హెచ్‌సీయూ 400 ఎకరాల మీద కన్ను పడింది. ఎకరం వంద కోట్లు ఖరీదైన భూముల వేలం ద్వారా 40 వేల కోట్లు దండుకోవాలని పన్నాగం. అందులో 10 వేల కోట్లు ముడుపుల కోసమే అన్నది ఇప్పుడు బయటపడింది. అసలు విషయం ఇట్లా ఉండగా, రెండు వేల ఎకరాల ఎకో పార్క్ అని బాకా మీడియా యెంత ఊదినా లాభం లేదు. అందుకే ముఖ్యమంత్రికి నిరంతర ఫ్రస్ట్రేషన్!

'మిమ్మల్ని సీఎం చేసినా కూడా, వారిని జైలుకు పంపడం లేదు ఎందుకు అని నన్ను అడుగుతున్నరు' అంటూ నిండు సభలో అధమ స్థాయి మాటలు మాట్లాడిన కురచ మనిషి రేవంత్. సీఎం పదవి తెచ్చుకున్నది అంత చీప్ లక్ష్యం కోసమా? వ్యక్తిగత కక్ష కోసమా? ఆయన తిరిగే కక్ష్య పరిధి అంతేనా? వేల లక్షలే మీ లక్ష్యమా? ఆయన కన్నా కురచబుద్ధుల రాధాకృష్ణ ఆయనకు రాజగురువు అయినంక ఇంతకంటే ఏమి ఆశించగలం? ఆయనేమో సభలోనూ, బయటా సుప్రీంకోర్టును సైతం అగౌరవిస్తరు. ఆయన రాజగురువేమో న్యాయవ్యవస్థనే బోనులో నిలబెడుతడు! ఎట్లాంటి బపూన్ల పాలయింది తెలంగాణ!

రేవంత్ దౌష్ట్యాలకు గురవుతున్న ప్రజలు తిరగబడుతున్నరు. మూగజీవులు తిరగబడలేవు కనుక బలవుతున్నవి. కన్నీరు కూడా పెట్టలేని వృక్షాల తలలు మౌనంగా నేలకు ఒరుగుతున్నవి. కానీ, సహజ న్యాయం అనేది ఒకటి ఉంటుంది. అందరి లెక్కలూ కాపరి రాస్తూ ఉంటడు. శిక్షలు తప్పవు. ఇది కర్మ సిద్ధాంతం అనుకోండి లేదా కవితాన్యాయం అనుకోండి. జరిగే తీరుతుంది!



పేదల పొయ్యి మండాలా? ఆకలితో వారి కడుపులు మండాలా?

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పుండు మీద కారం చల్లుతున్నది. శాడిస్టులా వ్యవహరిస్తున్నది. ప్రపంచ వ్యాప్తంగా ముడిచమురు ధరలు తగ్గుతుంటే మన దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతున్నాయి. ధరలు తగ్గించమని కాదు, ఉన్న ధరలను పెంచొద్దని వేడుకునే దయనీయ స్థితిలో దేశ ప్రజలు ఉన్నారు. పేదల ఇండ్లల్లో పొయ్యి మండాలా? లేదా ఆకలితో వారి కడుపులు మండాలా? మీరు సాయం చేయలేకపోతే, కనీసం ఇబ్బంది పెట్టకండి.

- ఎంకే స్టాలిన్, తమిళనాడు సీఎం

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ దేశంలోనే ఒక ప్రతిష్ఠాత్మకమైన సంస్థ. ప్రత్యేక తెలంగాణ సిద్ధించిన నాటినుంచి ఎన్నో వేల ఉద్యోగాలు భర్తీచేసిన ఘనత టీజీపీఎస్సీ సొంతం. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా మొదటి ఏడాదే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ అన్ని ఎన్నికల ప్రచార సభల్లో వాగ్దానం చేసింది. కానీ, 2 లక్షల ఉద్యోగాలు దేవుడెరుగు, గ్రూప్-1 పరీక్ష నిర్వహించి 20 వేల పేపర్లను కూడా సరిగ్గా దిద్దలేకపోయారు. ఈ తెలంగాణ భవిష్యత్తు, దేశ భవిష్యత్తు అయిన గ్రూప్-1 పరీక్షా ఫలితాలు పూర్తిగా తప్పుల తడకగా మార్చేశారు. 563 గ్రూప్-1 పోస్టులకు గాను పరీక్ష రాసిన 20 వేల మందిలో 40 శాతం మంది తెలుగు మీడియంలో పరీక్ష రాశారు. జీఆర్ఎల్ ప్రకారం టాప్ 500లో ఒక్క తెలుగు మీడియం అభ్యర్థి కూడా లేకపోవడం అందరినీ విస్మయానికి గురిచేసింది.

గ్రూప్-1 ఫలితాల్లో గోల్‌మాల్

'దేశ భాషలందు తెలుగు లెస్స' అని ఆంధ్రభోజులు శ్రీకృష్ణ దేవరాయలు అంటే, ఈ రేవంత్ రెడ్డి దేశ భాషలందు అసలు తెలుగును లెస్ చేసే కుట్ర చేస్తున్నాడు. 46 పరీక్షా కేంద్రాల్లో కేవలం 2 సెంటర్ల లోనే 74 మంది టాపర్లున్నారు. కొన్ని సెంటర్లలో ఒక్క టాపర్ కూడా ఎందుకు లేరు? ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు పరీక్షలు రాస్తే కొన్ని సెంటర్లలో 10 శాతం పాసయితే, ఇంకొన్ని సెంటర్లలో 0.2 శాతం పాసయ్యారు. ఈ అంతరం ఎలా సాధ్యం? పక్క పక్క రోల్ నంబర్లకు సుమారుగా 1300 మందికి ఒకేరకమైన ఫలితాలు ఎలా వస్తాయి? ఇదెలా సాధ్యమైంది.? కొందరు అభ్యర్థులకు కొన్ని సబ్జెక్టులలో ఉత్తమ ఫలితాలు వచ్చి, ఇంకొన్ని సబ్జెక్టులలో కేవలం 0, 1, 2, 3 మార్కులే రావడం, కఠినమైన ప్రిలిమ్స్ దాటుకొని ఫైనల్స్ రాసి నవ్వాళ్లకు విచిత్రంగా 2, 3, 6, 8, 9 మార్కులు రావడంలో ఆంతర్యం ఏమిటి? టీజీపీఎస్సీ వారు మార్చి 13న గ్రూప్-1 వాల్యుయేషన్ పారదర్శకంగా జరుగుతుందని ఒక వెబ్‌నోట్ రిలీజ్ చేశారు. కానీ, పరీక్షా ఫలితాలు ఫిబ్రవరిలో వస్తాయని, నవంబర్‌లోనే కాంగ్రెస్ పార్టీ తన అఫిషియల్ సోషల్ మీడియా ఖాతాల్లో పోస్ట్ పెట్టారు. ఇదెలా సాధ్యం? అసలు, కాంగ్రెస్‌కు టీజీపీఎస్సీకి ఏం సంబంధం? ఒక రాజ్యాంగబద్ధమైన సంస్థ విషయాలు కాంగ్రెస్‌కు ఎలా తెలుస్తున్నాయి?

తెలుగు భాష ప్రామాణికం కాదు
....TGPSC